కథాకేళి



# ఎందరో లీలావతులు

ఆ ప్రొడ్యూసర్ పేరు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అలాగే దర్శకుడి పేరు కూడా. అలాంటి వాళ్ళని చాలా మందినే చూడచ్చు మెరీనా తీరాన.

వాళ్ళ దృష్టిలో పడింది లీలావతి రాసిన నవల 'మూర్ఖుడు.' ఆ ఇద్దరినీ ముందర ఆ పేరు ఆకర్షించింది. ఒకప్పుడు బుద్ధిమంతుడు, గుణవంతుడు, శభాష్ రాముడు లాంటి మెత్తటి పేర్లు సినిమాలకి పెట్టేవారు. కానీ ఇప్పుడు దుర్మార్గుడు, దుష్టుడు, రౌడీ, గూండా లాంటి తిట్లని ఏక్షన్ సినిమాలకి పేర్లుగా వుంచడానికి వుబలాట పడుతున్నారు నిర్మాతలు. అలాంటి పేర్లకోసం పోటీపడి వాటిని ముందరే రిజిస్టర్ చేసి రిజర్వు చేసుకునే నిర్మాతలు కూడా ఒకరిద్దరు కద్దు.

'మూర్ఖుడు' నేటి సినిమాకి సరిపోయే పేరు కాబట్టి ఎందుకైనా మంచిదని దాన్ని ముందు రిజిస్టర్ చేసేసుకుని తర్వాత నవలని తెప్పించుకున్నారు నిర్మాత, దర్శకులు.

ఇద్దరూ దాన్ని సొంతం చదివాక కలుసుకున్నారు. లీలావతికి సినిమా కథలు ఎలా వుంటాయో తెలియదు కాబట్టే ఆమె తన ధోరణిలో పాఠకుల కోసం వ్రాసింది ఆ నవల. అయితే, బొగ్గుల మధ్య వున్న వజ్రానికి కూడా ప్రకాశం వున్నట్టు, ఆమె రాసిన మామూలు ధోరణి వెనక, సినిమాకి పనికివచ్చే కథ ఆ ఇద్దరినీ ఆకర్షించింది. 'మూర్ఖుడు' నవల సినిమాగా తియ్యడానికి పనికి వస్తుందని ఇద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చారు.

తమ ప్రొడక్షన్ మనిషిని లీలావతి దగ్గరికి పంపారు. లీలావతికి ఐదువేలిచ్చి ప్రపంచంలోని అన్ని భాషల్లో ఆ నవలని సినిమా తియ్యడానికి హక్కులు రాయించుకున్నారు.

'మూర్ఖుడు' నవలని సినిమాకి అనుగుణంగా మార్చే ప్రయత్నంలో నిర్మాత, దర్శకుడు, సంభాషణల రచయిత, నిర్మాత బావమరిది చర్చలు సాగించారు, మద్రాసులోని ఓ స్టార్ హోటల్లో.

అన్ని ఖర్చులు కలిపి రోజుకి వెయ్యిరూపాయిల చొప్పున 22 రోజుల్లో ఆ నవల తాలూకు సినిమా కథని తయారు చేశారు.

అక్కడ లీలావతి తన కథ సినిమాగా వస్తోందని ఎంతో సంబరపడిపోసాగింది. ధనస్వామ్యం మీద రైతుబిడ్డలు, కార్మికులు కడుపుమండి ఏవిధంగా ప్రతిఘటించారో తెరమీద అంతా త్వరలోనే చూశారు.

'మూర్ఖుడు' సినిమా ఎవరు ఎదురు చూడనట్లుగా అఖండ విజయం సాధించింది. అలాంటి సినిమాలు బాగా ఆడే 'బి, సి' సెంటర్లలో వందరోజులు, 'ఏ' లో అర్ధ సంవత్సరం పైగా ఆడిందా సినిమా.

ఆ నిర్మాత మీద ఎగబడ్డారు దాన్ని ఇతర భాషల్లో తీయడానికి హక్కుల కోసం. అది తమిళంలో నిర్మించబడుతున్న సంగతి తెలిసింది లీలావతికి. తర్వాత హిందీలో కూడా నిర్మించబడుతోందని తెలిసింది. ఇంత వరకూ తెలుగులో ఏ నిర్మాతా అమ్మనంత అధికరేటుకి హిందీ నిర్మాతకి 'మూర్ఖుడు' సినిమా హక్కులు తెలుగు నిర్మాత అమ్మాడని ఓ తెలుగు సినిమా వారపత్రికలో చదివింది.

భర్త ప్రోద్బలం మీద లీలావతి ఆ నిర్మాతకు ఉత్తరం రాసింది, తనకి కేవలం ఐదువేలే ఇచ్చారని, ఆ సినిమావల్ల అధిక లాభాలు వచ్చాయి కనుక తనకి మరో ఐదువేలు పంపమని కోరుతూ. కేవలం తెలుగు భాష వరకే రైట్స్ ఇవ్వాలన్న సంగతి ఆమెకి ఆలస్యంగా తెలిసింది.

ఆ నిర్మాత దాన్ని చదివి నవ్వుకుని దాన్ని చింపేశాడు. ఆ నవల్లోని సంఘటనలు తెరమీద ప్రేక్షకులకు నచ్చటం వల్లనే ఆ సినిమా బాగా ఆడిందని తెలిసిన లీలావతికి జవాబుకూడా రాయలేదు.

తన కొత్త సినిమా ఓపెనింగ్ సందర్భంగా ఆ రాత్రి ఓ స్టార్ హోటల్లో చిన్న పార్టీ ఇచ్చాడానిర్మాత. ఆ పార్టీలో స్కాచ్ విస్కీలకోసం పెట్టిన ఖర్చే పన్నెండున్నర వేల రూపాయిలు!

## మల్లాది వెంకట కృష్ణమూర్తి